# పిలిచిందెవరు?

- కె.రూపవాణి

"అబ్బ! ఎన్నాళ్ళకి నా చిరకాల వాంఛ తీరబోతోంది" అనుకున్నాడు కళాధర్.

ఎప్పుడూ ఏదో అవసరనిమిత్తం సిటీకి వచ్చి హడావుడిగా వెళ్లిపోయే కళాధర్‌కి...మునిమాపు చీకట్లు ముసిరేవేళ...అందాల దీపకాంతుల్లో మెరిసే టాంక్‌బండ్ అందాలను తనివితీరా చూడాలన్న కోరిక బాగా ఉండేది. కానీ తీరలేదు.

అనుకోని రీతిలో అతని కోరిక తీరే అవకాశం వచ్చిందిప్పుడు. అదీ ప్రభుత్వ సాయంతో.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి నిర్వహిస్తున్న 'రచయితల అధ్యయన శిబిరం'లో పాల్గొనడానికి అతను హైదరాబాద్ నగరానికి వచ్చాడు.

ఒకరోజు సాయంకాలం టాంక్‌బండ్ మీదకు తను కోరుకునే సమయంలో వెళ్లడానికి అవకాశం చిక్కింది కళాధర్‌కి.

టాంక్‌బండ్‌పై ఒక చివరి నుండి మరో చివరికి తిరుగుతూ...తెలుగువెలుగులైన ప్రముఖుల విగ్రహాలు చూసి కాసేపు ఆనందించాడు.

అలా కాసేపు తిరిగాక టాంక్‌బండ్ మీద ఉన్న ఒక సిమెంటు బెంచీ మీద కూర్చున్నాడు. హుస్సేన్‌సాగర్ జలాల మధ్యన నిలువెత్తు బుద్ధవిగ్రహాన్ని తదేకంగా చూడసాగాడు.

ఉదారంగు మెరుపుతో ఆకర్షణీయంగా ఉంది బుద్ధవిగ్రహం.

ప్రపంచానికి సత్యం గురించి అహింసల గురించి మనసులోని వెలుగు గురించి బోధించిన బుద్ధుడి గురించి తనకు తెలిసిన విషయాలు మననం చేసుకోసాగడతను చుట్టూ ప్రపంచాన్ని మరచి.

ఇంతలో తన పక్కనుంచో ఎవరో 'బాబూ' అని పిలిచినట్టనిపించింది.

పక్కకు తిరిగి చూస్తే ఎవరూ లేరు.

"ఎవరా నన్ను పిలిచింది" అనుకుంటూ మరింత పరిశీలనగా చుట్టూ పరిసరాలను గమనించసాగాడు.

పిల్లలను ఆటవిడుపుగా టాంక్‌బండ్ మీదకు తీసుకువచ్చిన పెద్దలు, జంటలు, టాంక్‌బండ్ మీద తినుబండారాలు అమ్మేవాళ్లు కనిపించారు. వారెవరూ తనను పిల్చినట్టు అనిపించలేదు. మరెవరు పిలిచివుంటారు?

'అంతా నా భ్రమ' అనుకుని సర్దుకుని కూర్చున్నాడు కళాధర్.

"నీ భ్రమ కాదు బాబూ, నేనే పిలిచింది నిన్ను" మళ్లీ అదే గొంతు తన పక్కనుంచే...

"ఎ...ఎ...ఎవరు మాట్లాడేది?" అతనికి కాస్త భయమేసింది. కాస్త కంపరంగానే ప్రశ్నించాడు.

"నేను బాబు! బుద్ధవిగ్రహాన్ని" మళ్లీ సమాధానంగా ఆ గొంతు పలికింది. భయంతో ఒక్క ఉదుటున పక్కకు గెంతాడు కళాధర్.

"భయపడకు బాబూ, ఒక్క క్షణం నేను చెప్పేది వింటావా?" మళ్ళీ అదృశ్యవాణి పలికింది.

దూరంగా బుద్ధవిగ్రహాన్ని చూస్తూ...దగ్గరగా ఆ విగ్రహం గొంతును వింటున్న భావన...

"ఏవిటీ..."అప్రయత్నంగానే తను ప్రశ్నించాడు.

"ఈ టాంక్‌బండ్ అందాలు నిన్ను అంతగా మైమరపిస్తున్నాయా?" గాలిలోని బుద్ధ విగ్రహం గొంతు ప్రశ్నించింది.

"ఆస్వాదించే హృదయం ఉన్న ఎవరినైనా ఈ అందాలు స్పందింపచేస్తాయి కదా!" అన్నాడు కాస్త ధైర్యంతో కళాధర్.

"అందాలే కనిపిస్తున్నాయి. నీటి అడుగున మరుగైన విషాదకథనాలు వినిపించడం లేదా?"

"అందం ఉన్న చోట విషాదమా? నిర్మలమైన ఈ హుస్సేన్‌సాగర్ పై నుండి వచ్చే చిరుగాలులతో మనసులోని విషాదాన్ని మరచిపోలేమా?!"




"అందమైన గులాబీపువ్వుతో పాటే ముళ్లుంటాయి కదా బాబు. అలాగే ఇక్కడి ఈ సుందరదృశ్యాల నడుమే అత్యంత విషాదకరమైన...భయానకమైన జీవన దృశ్యాలెన్నింటినో ఇక్కడ ఉన్నప్పట్నుంచి నేను చూస్తున్నాను నీకు తెలుసా?"

"ఏమిటవి?" ఆదుర్దాగా అడిగాడు కళాధర్.

"మనుషులను సేద తీర్చే ఈ సాగర తీరం సాక్షిగా ఆ జలాల్లో ఎంతమంది విగతజీవులయ్యారో నీకు తెలుసా? నన్ను కదిలించి అక్కడ నిలబెట్టేటప్పుడు మునిగిపోయిన వాళ్లు నీకు గుర్తున్నారా? నేరుగా నీళ్లల్లోకి దూసుకొచ్చేసి మునిగిపోయిన బస్సులోని మనుషులు ఎలా శవాలయింది మరిచావా? ఇవన్నీ వైపరీత్యాలనుకుంటే...మనసు విరిగినవాళ్లు...సరైన సమయంలో ఆసరా దొరకనివారు...కావాలని మృత్యుపాశం బిగించుకుంటూ ఇందులో దూకుతారు. శిలనైన నన్నే కదిలేలా చేసే విషాదజీవితాలవి"

"............"

"ఏవిటీ మాట్లాడవూ? పిల్లలనుండి పెద్దలవరకూ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతుంటే శిలనైన నేను "ధర్మం శరణం గచ్ఛామి", "సంఘం శరణం గచ్ఛామి" అనుకోవడం తప్పించి ఏవీ చేయలేని అశక్తుడనయ్యాను. త్వరగా మరచే గుణమున్న మీరు ఆ విషయం మరచి అందాలను ఆస్వాదిస్తుంటే ఆ దుర్ఘటనలకు ప్రత్యక్షసాక్షినైన నాకు మాత్రం ఇదంతా కన్నీటి కాసారంలా కనిపిస్తూంది. జీవితానికి...చావుకు మధ్య సన్నని పొర...సాలీడుగూడులా మనిషిని నలిపేస్తుంటే...అదంతా ఇక్కడకూడా జరుగుతుంటే ... ఇక్కడ్నుంచీ మరోసారి ఎక్కడకో వెళ్లిపోవాలనిపిస్తూంది"

కళాధర్ బుద్ధవిగ్రహం మాటలకు సమాధానంగా ఏదో చెప్పబోయాడు. ఇంతలో "సార్, కాస్త లేచి కూర్చుంటారా?" అన్న మాటలు వినపడ్డాయి.

అది తన పక్కన నిల్చున్న మనిషి గొంతు.

సిమెంటు బల్లపై పడుకునిపోయివున్న తనని ఎవరో పెద్దమనిషి తను కూర్చోవడానికి స్థలం కోసం లేపుతున్నాడని గ్రహించాడు కళాధర్.

లేచి కూర్చుని అయోమయంగా చూస్తున్న కళాధర్‌తో ఆ పెద్దమనిషి "సాయం సమయాలలో...చీకటివేళ దీపకాంతులలో టాంక్‌బండ్ అందాలు వర్ణించలేనివండీ" అన్నాడు తన్మయత్వంతో.

"అవును మరి గులాబి ఎవరికి మాత్రం అందంగా కనిపించదు. పైకి అందంగా కనిపించే గులాబీని వెంబడించే వుండే ముల్లు గుచ్చుకుంటేనే కదా ఇహలోకంలోకి వచ్చేది' మనసులో అనుకున్నాడు కళాధర్.

కళాధర్‌కు టాంక్‌బండ్ అందాలకన్నా ...ఆ జలాశయంలో విషాదంగా ...జీవితపాశవికతకు, కష్టనష్టాలకు తలవాల్చేసిన విగతజీవులెందరెందర్నో నిశ్శబ్దంగా తనలో దాచేసుకున్న నీటి కాఠిన్యం చిక్కగా...నల్లగా...కనిపించసాగింది. కానరాని చీకటిలో...జీవితాంతానికి చిరునామా ఇక్కడేనంటూ వెదుక్కుంటూ వచ్చే వాళ్లను తలచుకునేకొద్దీ మనసు బరువెక్కసాగింది.

ఇంకా కారుణ్యమూర్తి బుద్ధుడేవో తనతో చెబుతున్నట్టే అనిపిస్తుంటే...మెల్లగా అక్కడినుంచి కదిలిపోయాడు కళాధర్...

కలకు...వాస్తవానికి మధ్య అర్థం కాని జీవితమేదో గజిబిజీగా అనిపిస్తూంటే....

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక మండలి నిర్వహిస్తున్న కథానికా శిబిరంలో నవరచయితలు 'స్పాంటేనియస్'గా రాసిన కథల్లో రెండు)